ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3



పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

బుధవారం 28 మే 2025

రాష్ట్ర పండుగగా ఎన్టీఆర్ జయంతి

పార్వతీపురం, మే27 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో బుధవారం ఎన్టీఆర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం సంబంధిత అధికారులతో మాట్లాడుతూ.. మాజీ సీఎం నందమూరి తారక రామారావు జయంతిని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా నిర్ణయించిందన్నారు. ఈ మేరకు ఉత్సవాల్లో అధికారులంతా పాల్గొనాలని సూచించారు. ఎన్టీఆర్ జీవిత విశేషాలను తెలియజేస్తూ ఛాయాచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాష్ట్రానికి ఆయన చేసిన సేవలపై వక్తల సందేశాలు, నాటక ప్రదర్శనలకు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు.

మహానాడులో మనోళ్లు



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో మంత్రి సంధ్యారాణి



మహానాడులో పాల్గొన్న పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర, ప్రభుత్వ విప్ జగదీశ్వరి తదితరులు

- కడప గడ్డపై జగన్‌పై ధ్వజమెత్తిన మంత్రి సంధ్యారాణి

పార్వతీపురం/సాలూరురూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టే మహానాడు కార్యక్రమం మంగళవారం కడపలో అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ వేడుక లో జిల్లా శ్రేణులు సందడి చేశారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ప్రభుత్వ విప్, కురు పాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, పార్వతీ పురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, సాలూ రు, పార్వతీపురం, పాలకొండ, కురుపాం నియోజకవర్గాలకు చెందిన టీడీపీ నాయకు లు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. అనంతరం మంత్రి సంధ్యారాణి మాజీ సీఎం జగన్‌పై ధ్వజమెత్తారు. గత ఐదేళ్లు సైకో జగన్ రాష్ట్రవ్యాప్తంగా మహిళలను ఏడిపించారని ఆరోపించారు. అండగా ఉంటానని చెప్పి పథకాలన్నీ రద్దు చేశారని వివరించారు. తల్లి, చెల్లెను గెంటేసిన జగన్ కడప పిల్లిగా తయార య్యారన్నారు. మహిళా సంఘాల సొమ్మును కూడా పక్కదారి పట్టించారని తెలిపారు. ఉద్యోగాలు, స్థానిక సంస్థలు, కళాశాల సీట్ల కేటాయింపుల్లో 33 శాతం రిజర్వేషన్లు ఇచ్చి సీఎం చంద్రబాబునాయుడు మహిళలకు ఆదుకుంటున్నారని కొనియాడారు. ఒక ఉత్తరం రాసినా, వాట్సాప్ పెట్టినా.. మహిళల కన్నీళ్లను మంత్రి లోకేష్ తుడుస్తున్నారన్నారు. ప్రభుత్వం నారీశక్తి ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు. మహిళల రక్షణకు పార్టీ నేతలు పనిచేయాలని పిలుపునిచ్చారు. అన్నింటా అండగా ఉంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు రాష్ట్ర మహిళలు ఎంతో రుణపడి ఉంటారన్నారు.

టిడ్కో ఇళ్లు ఇప్పిస్తామని డబ్బుల వసూలు

- బాధితుల ఫిర్యాదుతో మహిళ అరెస్టు

పార్వతీపురం టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : టిడ్కో ఇళ్లు ఇప్పిస్తామని కొంతమంది పేదలను ఆమె నమ్మించింది. వారి నుంచి లక్షలాది రుపాయలు వసూలు చేసింది. మాయమాటలతో అందర్నీ మోసం చేసింది. చివరకు కటకటాలపాలైంది. పార్వతీపురం పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తవలసకు చెందిన ఎ.పద్మాంబిక పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన పేద, మధ్య తరగతి ప్రజలకు టిడ్కో ఇళ్లు ఇప్పిస్తానని నమ్మబలికింది. వారి నుంచి సుమారు రూ.15 లక్షల వరకు వసూలు చేసింది. రోజులు గడుస్తున్నా.. ఆమె నుంచి సరైన సమాధానం రాక పోవడంతో మోసపోయినట్లు బాధితులు గుర్తించారు. ఈ మేరకు పట్టణంలోని సాయినగర్ కాలనీకి చెందిన కె.సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగదీష్ తెలిపారు. సదరు మహిళను అరెస్టు చేసి స్థానిక కోర్టులో హాజరుపరచగా ఆమెకు రిమాండ్ విధించినట్లు వెల్లడించారు.

బాల్య వివాహాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం, మే 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాల్య వివాహాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో మహిళా శిశు సంక్షేమశాఖ, గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడపిల్లలను చదివించి.. వారి హక్కులను కాపాడాలన్నారు. బాల్య వివాహాలతో జరిగే అనర్థాలను తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన వన్‌స్టాప్ సెంటర్లపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. 'ధరి ఆబా జన జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్'పై జూన్ 15 నుంచి 30 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని చిత్తశుద్ధితో అమలు చేయడానికి కృషి చేస్తుందని వెల్లడించారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా కార్యక్రమాలు చేపట్టను న్నట్లు స్పష్టం చేశారు. పౌష్టికాహారం అందించే పునరావాస కేంద్రాలకు ప్రతిపాదనలు పంపించా లని కలెక్టర్ ఆదేశించారు. కేంద్రం అవసరాలను గుర్తించి పక్కాగా ప్రతిపాదనలు అందించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేయనున్న పాలపొడి ప్యాకెట్లను విడుదల చేశారు. బాల్య వివాహాల నివారణ, వన్‌స్టాప్ సెంటర్లు తదితర అంశాలపై పోస్టర్లను ఆవిష్క రించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ టి.కనకదుర్గ, డీఆర్వో కె.హేమలత, డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి, డీపీవో కొండలరావు , మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులు పాల్గొన్నారు.

- అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గ్రామస్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్టు కలెక్టర్ తెలిపారు. జిల్లా, మండల అధికారులతో మాట్లాడుతూ.. 'ఇప్పటివరకు 'మన్యం'లో 216 మంది మాస్టర్ ట్రైనర్ల శిక్షణ జరిగింది. 3,550 మంది నమోదు చేసుకుని శిక్షణ పొందుతున్నారు. జూన్ 21 నాటికి ప్రతిఒక్కరూ యోగాపై అవగాహన కలిగి, సాధన చేసే విధంగా ఉండాలి. ప్రతి గ్రామంలో యోగా పోటీలు నిర్వహించాలి.' అని తెలిపారు. ఈ సమావేశంలో జేసీ శోభిక, డీఎంహెచ్‌వో భాస్కరరావు, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి జగన్, పబ్లిక్ కన్సల్టెంట్ రఘు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ఫాంపాండ్లు

పూర్తి చేయకుంటే చర్యలు

- డ్వామా పీడీ రామచంద్రరావు

సాలూరు రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఫాంపాండ్లు (వ్యవసాయ పంట కుంటలు) నిర్ణీత గడువులోగా పూర్తి చేయకుంటే ఉపాధి సిబ్బందిపై చర్యలు తప్పవని డ్వామా పీడీ రామచంద్రరావు హెచ్చరించారు. మంగళవారం సాలూరు మండల పరిషత్ కార్యాలయంలో సాలూరు, మక్కువ, పాచిపెంట మండలాల ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. ఫాంపాండ్ల నిర్మాణంలో మూడు మండలాలు వెనుకడి ఉండడంపై మండిపడ్డారు. వచ్చే నెల 7నాటికి సాలూరు మండలంలో వాటి నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. పాచిపెంటలో ఈ నెలాఖరుకు నిర్ణీత లక్ష్యా న్ని చేరుకోవాలన్నారు. మక్కువలో సైతం సత్వరమే ఈ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. యోగాంధ్ర యాప్‌లో పలువురు ఉపాధి కూలీలు నమోదయ్యే విధంగా శ్రద్ధ చూపాలన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం పనికిరాదన్నారు. ప్రభుత్వ లక్ష్యాల మేరకు పనిచేయాలని సూచించారు. వచ్చే నెల 21న విశాఖపట్నంలో జరగనున్న ప్రపంచ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని, ఉపాధి సిబ్బంది సైతం సహకారమందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఏపీవోలు, జేఈలు, టీఏ,ఫీల్డ్ ఆసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముని ధనుస్సుకు పూజలు



4లో

అసాంఘిక శక్తుల ఆగడాలను అరికట్టండి

- ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి

4లో



మరమ్మతులు చేస్తే.. సస్యశ్యామలమే..

- గత ఐదేళ్లు నిర్లక్ష్యానికి గురైన నూలుగెడ్డ మినీ రిజర్వాయర్
- కాలువల్లో పూడికతీతకూ నిధులు మంజూరు చేయని వైసీపీ
- 211 ఎకరాలకు పూర్తిస్థాయిలో అందని నీరు
- ఏటా వరుణుడిపైనే ఆధారం..
- ఆందోళనలో రైతులు
- రాష్ట్ర ప్రభుత్వంపైనే ఆశలు

కురుపాం, మే27(ఆంధ్రజ్యోతి): కురుపాంలో నూలుగెడ్డ మినీ రిజర్వాయర్ పరిస్థితి దయనీయంగా మారింది. కొన్నాళ్లుగా ఎటువంటి మరమ్మతులకు నోచుకోవడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం కనీసం కాలువల్లో పూడికతీతలు కూడా చేపట్టలేదు. దీంతో ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందడం లేదు. ఏటా రైతులు వరుణుడిపైనే ఆధారపడి సాగు చేసుకోవాల్సి వస్తోంది. సుమారు 25 ఏళ్ల కిందట కురుపాం గిరిజన సంక్షేమ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల వెనుక భాగంలో నూలుగెడ్డ మినీ రిజర్వాయర్‌ను నిర్మించారు. దీని నుంచి నాలుగు చెక్‌డ్యామ్‌ల ద్వారా సుమారు 211 ఎకరాలకు సాగునీరందేది. చెక్‌వాల్ ద్వారా కురుపాం ఆసుపత్రి వెనుక భాగంలో ఉన్న పొలాలకు, కస్పాగదబవలస, పాత కురుపాంలో భూములకు కూడా నీరు అందేది. అయితే గత కొన్నాళ్లుగా రిజర్వాయర్ కనీస నిర్వహణకు నోచుకోవడం లేదు. ఇప్పటికే రిజర్వాయర్ తలుపులు పూర్తిగా పాడయ్యాయి. దీంతో వర్షకాలంలో నీరు నిల్వ ఉండడం లేదు. నీరు వృథాగా పోతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఏటా రైతులు సాగు నీటికి ఇబ్బందులు పడుతున్నా.. గత వైసీపీ ప్రభుత్వం చలించలేదు. మరమ్మతులకు నిధులు మంజూరు చేయలేదు. దీంతో రిజర్వాయర్ అధ్వానంగా

(మిగతా 6వ పేజీలో...)



పాడైన నూలుగెడ్డ మినీ రిజర్వాయర్ తలుపు



పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న చెక్ వాల్

కాస్త బాగుచేస్తే.. అద్దె మిగులుతుంది కదా..

- పరాయి పంచన పీఏసీఎస్ కార్యాలయం
- నిరుపయోగంగా పాత తహసీల్దార్ భవనం

6లో



యోగాతోనే ఆరోగ్యం

- ఉత్సాహంగా శిక్షణ కార్యక్రమాలు
- అవగాహన ర్యాలీలు



6లో

కదలని గజరాజులు

గరుగుబిల్లి, మే27(ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి మండలం నుంచి గజరాజులు కదలడం లేదు. నిత్యం ఏదో ఒకచోట సంచరిస్తూ స్థానికులను బెంబేలెత్తిస్తున్నాయి. సోమవారం తోటపల్లి ప్రాంతంలో మామిడి తోటను ధ్వంసం చేసిన ఏనుగులను సుంకి ప్రాంతానికి తరలించిన విషయం తెలిసిందే. కాగా మంగళవారం అవి తోటపల్లి నాగావళి నదికి ఆనుకుని ఉన్న పంపు హౌస్ ప్రాంతంలో హల్‌చల్ చేశాయి. అయితే తిరిగి అవి ఎప్పుడు గ్రామాల్లోకి వస్తాయోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఏ క్షణాన ఏం జరుగుతందోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. అటవీశాఖాధికారులు స్పందించి తక్షణమే వాటిని ఈ ప్రాంతం నుంచి తరలించాలని ఆయా ప్రాంతవాసులు డిమాండ్ చేస్తున్నారు.



తోటపల్లి పంపు హౌస్ ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగులు

ప్రజారోగ్యమంటే ఖాతరు లేదా?

- సాలూరు మార్కెట్లో కుళ్లిన కోడి మాంసం
- అపరిశుభ్ర వాతావరణంలో విక్రయాలు
- తూనికల్లో భారీ తేడాలు
- అధికారుల తనిఖీల్లో బహిర్గతం

సాలూరు రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): సాలూరు మున్సిపాల్టీలో కొందరు వ్యాపారులు బరితెగించారు. నిబంధనలు విరుద్ధంగా నడుచుకుంటూ ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. తూనికల్లో మోసాలకు పాల్పడుతూ.. అపరిశుభ్ర వాతావరణంతో వ్యాపారాలు చేస్తున్నారు. యథేచ్ఛగా కుళ్లిన కోడి మాంసాన్ని విక్రయిస్తున్నారు. మంగళవారం అధికారుల తనిఖీల్లో ఈ విషయాలు బయటపడ్డాయి. వివరాల్లోకి వెళ్తే.. మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావేటి బాలకృష్ణ తన సిబ్బందితో సాలూరులో మార్కెట్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాత బస్టాండ్ వద్ద ఉన్న ఒక చికెన్ దుకాణంలో కుళ్లిన కోడి మాంసం విక్రయానికి పెట్టినట్లు గుర్తించారు. దాదాపు 16 కిలోల వరకు ఉన్న ఈ మాంసం వినియోగదారులకు అంటగట్టడానికి ప్రయత్నించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. షాపు యాజమానికి రూ. 3వేలు జరిమానా విధించారు. మరోసారి ఇలా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పలు చికెన్ షాపులు, వాణిజ్య దుకాణాలను పరిశీలించారు. అపరిశుభ్ర వాతావరణంలో విక్రయాలు జరపడంపై మండిపడ్డారు. వారికి రూ. 3వేలు జరిమానా విధించారు. 4 కిలోల సింగిల్ యూజ్ క్యారీ బ్యాగ్‌లను స్వాధీనం చేసుకున్నారు.



సాలూరు మార్కెట్‌లో చికెన్,చేపల వ్యాపారులకు సూచనలిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్

తూనికల్లో మోసం..

పట్టణంలోని పెదమార్కెట్, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద విక్రయిస్తున్న చేపల దుకాణాలను శానిటరీ ఇన్‌స్పెక్టర్ పరిశీలించారు. తూనికల్లో మోసాలను గుర్తించారు. ఆయా చోట్ల కిలోకు 250 గ్రాములు తేడా రావడం గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని తహసీల్దార్ ఎన్వీ రమణ దృష్టికి తీసుకెళ్లారు. తూనికల కొలత అధికారులతో పరిశీలన చేయించాలని కోరారు. కొవిడ్ ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో వ్యాపారులు పరిశుభ్రత పాటించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూచించారు. కుళ్లిన మాంసం, చేపలను ఎట్టి పరిస్థితుల్లో విక్రయించరాదన్నారు. ప్రజలు సైతం జాగ్రత్తలు పాటించాలని కోరారు.



మహానాడు సంబరం





కడప గడపలో టీడీపీ మహానాడు కార్యక్రమం తొలిరోజు సంబరంగా సాగింది. మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకతో పాటు విదేశాల నుంచీ వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో కడప గడప పసుపుమయంగా మారింది. ఉదయం ప్రతినిధుల సభకు సభ్యత్వ నమోదుతో మొదలైన కార్యక్రమం సాయంత్రం చంద్రబాబు ప్రసంగంతో ముగిసింది. వందలాది కార్యకర్తలు రక్తదానం చేశారు. లోకేశ్‌తో సెల్ఫీలు, షేక్‌హ్యాండ్ కోసం కార్యకర్తలు, అభిమానులు ఎగబడ్డారు. వేదికపై చంద్రబాబు, లోకేశ్ మాట్లాడుతున్నంతసేపూ జనం కేరింతలు కొట్టారు. 'ఈసారి కడప కూడా మాదే', యువగళం సక్సెస్ తదితర ప్లకార్డులను, ఫ్లెక్సీలను కార్యకర్తలు ప్రదర్శించారు. వేలాదిగా తరలివచ్చిన జనానికి మంచి విందు భోజనం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహానాడు సంబరంగా సాగింది. రెండోరోజు మహానాడు కోసం అందరూ ఉత్సాహంగా ఎదురుచూస్తూ వారికి కేటాయించిన విడిది కేంద్రాల్లో బస చేశారు.



మహానాడులో మన నాయకులు

కడపలో నిర్వహిస్తున్న తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో నేతలు, కార్యకర్తలు తరలివెళ్లారు. అక్కడ నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు.

-ఆంధ్రజ్యోతి బృందం



రాజాం: ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహనరావు తదితరులు



భోగాపురం: మంత్రి నారా లోకేష్‌తో మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు



విజయనగరం: మహానాడులో పాల్గొన్న ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యేలు కళా, అదితిగజపతిరాజు, ఎమ్మెల్సీ గ్రీష్మ తదితరులులు



శృంగవరపుకోట/బొబ్బిలి రూరల్: మహానాడులో ఎమ్మెల్యేలు లలితకుమారి, బేబీనాయన



సీతారామ ఆలయంలో పూజలందుకుంటున్న ధనుస్సు

శ్రీరాముని ధనుస్సుకు పూజలు

గజపతినగరం, మే 27 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలోని శ్రీరాముని ఆలయంలో ప్రతిష్ఠించనున్న ధనుస్సు మంగళవారం స్థానిక సీతా రామాలయానికి చేరుకుంది. బంగారం, వెండిని కలిపి చేసిన ఈ ధనుస్సు 14 కిలోల బరువు ఉంది. హైదరాబాద్‌కు చెందిన చల్లా శ్రీనివాసశాస్త్రి దీన్ని రూపొందించారు. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ దేవాలయాల్లో భక్తుల సందర్శనార్థం దీనిని ఉంచుతున్నట్టు ఆలయ అర్చకుడు అనంత్ తెలిపారు. ఈ ధనుస్సును అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కొల్లా సాంబమూర్తి, ఆర్య వంశ జిల్లా అధ్యక్షుడు పూసర్ల మోహన్, యువజన ఆర్య వంశ సంఘం అధ్యక్షుడు ఆరిశెట్టి సందీప్ తదితరులు పాల్గొన్నారు.





ముత్యాలమ్మ, తోగాలమ్మలకు నిమ్మకాయలతో అలంకరించిన దృశ్యం

గ్రామదేవతలకు ప్రత్యేక అలంకరణ

భోగాపురం, మే 27 (ఆంధ్రజ్యోతి): గుడివాడ గ్రామ దేవతలు ముత్యాలమ్మతల్లి, తోగాలమ్మ తల్లికి మంగళ వారం నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ అమ్మవార్లకు ప్రతి మంగళవారం విభిన్నంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా అమ్మవార్లను పచ్చని, పసుపు నిమ్మకాయలతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

అసాంఘిక శక్తుల ఆగడాలను అరికట్టండి

- ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి



మాట్లాడుతున్న శ్రీనివాసానంద సరస్వతి

విజయనగరం కలెక్టరేట్, మే 27 (ఆంధ్ర జ్యోతి): విద్యల నగరమైన విజయనగరంలో అసాంఘిక శక్తులు తయారు కావడం చాలా బాధాకరమని..వీరి ఆగడాలను అరికట్టాలని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి అన్నారు. అసాంఘిక శక్తులను అడ్డుకోవాలని కోరుతూ కలెక్టర్ అంబేడ్కర్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ఉభయ రాష్ట్రాల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు వెలుగు చూసినా మూలాలు హైదరాబాద్ పాతబస్తీలో ఉండేవని గుర్తు చేశారు. ఇప్పుడు అటువంటి మూలాలు విజయనగరంలో ఉంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నగరం మరో పాత బస్తీగా తయారు కావడానికి కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఉగ్రలింకులతో సంబంధం ఉన్న సిరాజ్ కుటుంబ సభ్యులపై కూడా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



అధికారులతో చర్చిస్తున్న న్యాయాధికారి విజయచందర్

వసతిగృహాల్లో మౌలిక వసతులు కల్పించండి

కొత్తవలస, మే 27 (ఆంధ్రజ్యోతి): వసతిగృహాల్లోని విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని కొత్తవలస కోర్టు న్యాయాధికారి డాక్టర్ సముద్రాల విజయచందర్ అధికారులను ఆదేశించారు. మండలంలోని వివిధ వసతి గృహాలను మంగళవారం ఆయన పరిశీలించారు. మంచినీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు సక్రమంగా లేకపోవడాన్ని గుర్తించారు. ఈమేరకు సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. న్యాయవాద సంఘ అధ్యక్షురాలు వీఎల్ దేవి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌కు ఘనంగా పూజలు

నెల్లిమర్ల, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామ స్వామి వారి దేవస్థానంలో హనుమాన్ విగ్రహం వద్ద అర్చకులు మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 'జై హనుమాన్' అనే అక్షర ఆకృతిలో దీపాలను అమర్చారు. వీటిని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఈవో వై.శ్రీనివాసరావు, అర్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు, కిరణ్‌కుమార్, గొడవర్తి నరసింహాచార్యులు, పాణంగిపల్లి ప్రసాద్, పవన్ కుమార్, రామ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

హనుమంతుడికి పూజలు చేస్తున్న భక్తులు



నిర్వహణ లేక.. సాగునీరు అందక

● పూర్తిస్థాయి మరమ్మతులకు నోచుకోని పంట కాలువ ● 1800 ఎకరాల ఆయకట్టుకు ఇదే ఆదరువు

భోగాపురం, మే27 (ఆంధ్రజ్యోతి): భోగాపురం పంచాయతీ సుందరపేట సమీపంలోని సాగునీటి కాలువ అధ్వానంగా ఉంది. పిచ్చిమొక్కలు, తుప్పలతో నిండింది. ఈ కాలువ నుంచే ఎండిబంద, పాలబంద, కోవిటి చెరువు, దొరగారి చెరువు, బంద తదితర చెరువులకు నీరు చేరుతుంది. సుమారు 1800 ఎకరాల ఆయకట్టు ఇదే ఆదరువు. అయితే సుందరపేట సమీపంలో పంట కాలువకు నిర్వహణలేక రూపు కోల్పోయింది. వర్షాలు కురవక ముందే కాలువను బాగుచేయాల్సి ఉన్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకునే పరిస్థితి లేదు. గతంలో కాలువను సగం వరకూ బాగుచేసి వదిలేశారు. తక్షణమే మిగిలిన కాలువ బాగుచేస్తే ఈ ఏడాది సాగునీటి కష్టాలు తీరే అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు. ●దీనిపై ఇరిగేషన్ ఏఈఈ ఎం.రమేశ్‌చంద్ర మాట్లాడుతూ ఇక్కడ ఉపాధి హామీ పథకంలో భాగంగా కొంత మేర కాలువలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అయితే నీరు నిల్వ ఉండటంతో కాలువ మొత్తం పనులు చేపట్టలేకపోయామన్నారు. కాలువలో నీటిమట్టం తగ్గితే పనులు చేపడతామన్నారు.


తుప్పలతో నిండిన పంట కాలువ

విజయనగర ఉత్సవాలకు రూ.50 లక్షలు

విజయనగరం కలెక్టరేట్, మే 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఏటా అక్టోబరులో నిర్వహిస్తున్న విజయనగర ఉత్సవాన్ని పర్యాటక ఉత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందని కలెక్టర్ అంబేడ్కర్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ఉత్సవ నిర్వహణకు ప్రభుత్వం రూ. 50 లక్షలు కేటాయించిందని పేర్కొన్నారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన ఉత్తర్వులను ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ జారీ చేశారని తెలిపారు.

నేడు ఎన్టీఆర్ జయంతి

విజయనగరం కలెక్టరేట్, మే 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి దివంగత ఎన్టీ రామారావు జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందని కలెక్టర్ అంబేడ్కర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం ఉదయం జయంతి వేడుకలను నిర్వహిస్తామన్నారు.

పోస్టాఫీసులో ఎన్‌పీసీఐ లింక్

విజయనగరం రింగురోడ్డు, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాల నగదు బదిలీ కోసం పోస్టాఫీసులో ఎన్‌పీసీఐ లింక్‌ను సులభంగా చేసుకోవచ్చునని డివిజనల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాల నగదు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో పడటానికి ఎన్‌పీసీఐ లింకు తప్పనిసరన్నారు. అర్హులు దగ్గరలోని పోస్టాఫీసుకు వెళ్లి ఈ సేవలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

నేటి నుంచి శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

గజపతినగరం, మే27 (ఆంధ్రజ్యోతి): స్థానిక బజార్ సెంటర్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో 28 నుంచి జూన్ 1 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్టు అర్చకుడు శ్రీనివాసాచార్యులు తెలిపారు. బుధ వారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. 28న శేషగరుడ వాహనసేవ, కోలాట ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. 29న అగ్ని ప్రతిష్ఠాపన, నివేదన మంగళాశాసనం చేపడతా మన్నారు. 30న నిత్య హోమం, తిరుకల్యాణ మహోత్సవం, 31న నిత్యహోమాలు, దీపో త్సవం నిర్వహిస్తామన్నారు. 1న పుష్పయాగం తో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయని ఆయన తెలిపారు.

దివ్యాంగుల గుర్తింపునకు సర్వే

వేపాడ, మే 27 (ఆంధ్రజ్యోతి): బడిబయట పిల్లలను గుర్తించేందుకు ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నట్టు ఎంఈవోలు ఎస్.నాగభూషణరావు, పి.బాలభాస్కరరావు తెలిపారు. మంగళవారం వారు వేపాడలో ఇంటింటా సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయంతి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు సాంబశివరాజు మృతి

గుర్ల, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కెల్లా గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కె.సాంబశివరాజు మంగళవారం మధ్యాహ్నం మృతి చెందారు. కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. 50 ఏళ్లుగా రాజకీయాల్లో ఉంటూ టీడీపీలో క్రియాశీలకంగా ఆయన వ్యవహరించారు. పలు పదవులు నిర్వహించారు. సాంబరాజు కుమార్తె విమలారాణి టీడీపీలో జిల్లా మహిళా విభాగంలో కీలకంగా పనిచేస్తున్నారు.

నేటి నుంచి ప్రయోగ పరీక్షలు

విజయనగరం కలెక్టరేట్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు బుధవారం నుంచి జూన్ 1 వరకూ జరగనున్నాయని ఇంటర్మీడియట్ బోర్డు అధికారి తవిటినాయుడు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని 9 కేంద్రాల్లో ప్రయోగ పరీక్షలు జరగనున్నాయని తెలిపారు.

జేసీకి ధన్యవాదాలు


జేసీని కలిసిన డీలర్ల సంఘ జిల్లా నేతలు

శృంగవరపుకోట రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ఎండీయూ వ్యవస్థను రద్దు చేయడంపై రేషన్ డీలర్ల జిల్లా సంఘ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో జేసీ సేతు మాధవన్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కొణదం ఉమమహేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎండీయూ వ్యవస్థ వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రభుత్వం ఆ వ్యవస్థను రద్దు చేసి ప్రజలకు మేలు చేసిందన్నారు. అనంతరం డీఎస్‌వోను మర్యాదపూర్వకంగా సంఘం ప్రతినిధులు కలిశారు.

ఉద్యోగాలకు 187 మంది ఎంపిక


జాబ్‌మేళాలో మాట్లాడుతున్న టి.వి.గిరి

విజయనగరం దాసన్నపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వీటీ అగ్రహారంలో గల ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మంగళవారం క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. పది కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. సుమారు 386 మంది ఐటీఐ అభ్యర్థులు హాజరయ్యారు. అందులో 178 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ టి.వి.గిరి, కంపెనీల ప్రతినిధులు ప్రతాప్, చిన్న, గిరిశీం, జి.కమల్, ఎన్.రవి, పీవీ శాస్త్రి, చంటిబాబు, విజయ్‌కుమార్, ఆర్.నందు పాల్గొన్నారు.

30న డీఎస్సీ మోడల్ పరీక్ష


మాట్లాడుతున్న హరీష్

విజయనగరం దాసన్నపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక గురజాడ గ్రంథాలయం కేంద్రంగా ఈనెల 30న డీఎస్సీ మోడల్ పరీక్షను నిర్వహించనున్నామని డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ హరీష్ తెలిపారు. మంగళవారం ఎల్‌బీజీ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పరీక్ష ఎస్టీటీ అభ్యర్థులకు మాత్రమేనన్నారు. మోడల్ పరీక్షను గురజాడ గ్రంథాలయం కేంద్రంగా నిర్వహిస్తామన్నారు. ఈ ప్రశ్నాపత్రాన్ని విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు తయారు చేస్తున్నారన్నారు. రూ.50 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 8019273486, 7095956895 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఆయనతో పాటు ఉపాధ్యక్షుడు సతీష్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి


మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘ నాయకుడు

రాజాం, మే 27 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశాయి. ఇంజనీరింగ్ వర్కర్ల సమ్మెకు వారు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు జె.నీలయ్య మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమస్య పరిష్కారమయ్యే వరకూ ఉపాధ్యాయ సంఘాల సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రెడ్డి మోహనరావు, పక్కి వాసు, మారెళ్ల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలుగా తీర్మానాలు


తీర్మానిస్తున్న అధికారులు

గుర్ల, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవుని కణపాక, ఫకీరు కిట్టలి, కొండ గండ్రేడు తదితర గ్రామాల్లో సారా నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని మండల అధికారులు తీర్మానం చేశారు. మంగళవారం తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఎంపీడీవో శేషుబాబు, ఎంపీపీ ప్రమీల, ఎస్ఐ నారాయణరావు, ఎక్సైజ్ అధికారులు, గ్రామ రెవెన్యూ కార్యదర్శి సంయుక్తంగా తీర్మానం చేశారు.

క్రీడా పోటీలు ప్రారంభం


క్రీడాకారులతో కలిసి ఆడుతున్న ఎమ్మెల్సీ

శృంగవరపుకోట, మే 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిబిరంలో భాగంగా నిర్వహించిన క్రీడాపోటీలను మంగళవారం ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ప్రారంభించారు. క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించాలని ఆకాంక్షించారు. చీఫ్ కోచ్ పొట్నూరు శ్రీరాములు మాట్లాడుతూ ఇప్పటి వరకు శిక్షణలో నేర్చుకున్న అంశాలు ఈ పోటీలతో బయటపడనున్నాయన్నారు.

3లోగా అడ్మిషన్ తీసుకోండి

లక్కవరపుకోట, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రవేశ పరీక్ష రాసి మెరిట్ సాధించిన విద్యార్థులు మండలంలోని జమ్మాదేవిపేటలో మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో జూన్ 3లోగా అడ్మిషన్ పొందాలని ప్రిన్సిపాల్ యూవీకే పాత్రో ఓ ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ఫలితాలను పాఠశాల ఆవరణలోని నోటీస్ బోర్డులో అందుబాటులో ఉంచామన్నారు. దరఖాస్తుతో పాటు ర్యాంకు కార్డు, రికార్డ్ షీట్, స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ, రేషన్ కార్డు, జనన ధ్రువీకరణ, ఆధార్ కార్డు, తల్లి బ్యాంకు ఖాతా, తల్లిదండ్రుల ఫొటో, బ్లడ్ గ్రూపు సర్టిఫికెట్‌లు తీసుకుని పాఠశాలను సంప్రదించాలని ఆయన సూచించారు.

సాగునీటి కాలువ పరిశీలన


ఇసుక తవ్వకాల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్ఐ

శృంగవరపుకోట రూరల్, మే27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చామాలపల్లి వద్ద జామి మండలం తానవరం, ఇతర ప్రాంతాలకు సాగునీరు అందించే కాలువను కొందరు ఇసుక దొంగలు కూల్చేయడంపై రైతుల ఫిర్యాదు మేరకు తహసీల్దార్ అరుణకుమారి స్పందించారు. మంగళవారం ఆర్ఐ మనోజ్, వీఆర్వో గణేశ్‌లను విచారణకు పంపించారన్నారు. దాంతో ఇసుక తవ్వకాలు నిలిచాయి. ఆర్ఐ మాట్లాడుతూ రెండు రోజుల్లో కాలువ ప్రాంతంలో తవ్వకాలు జరగకుండా ట్రెంచ్‌లు తవ్విస్తామన్నారు. దీంతో ఇసుక తవ్వకాలకు చెక్ పడుతుందన్నారు. అనంతరం స్థానిక విలేకరులతో రైతులు మాట్లాడారు. 15 రోజులుగా తమకు సాగునీరు వచ్చే కాలువ వద్ద పెద్దఎత్తున ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. తవ్వకాలు చేపట్టవద్దని వారికి చెబుతుంటే వారు గొడవకు దిగుతున్నారన్నారు. ఇదే విషయంపై కొద్దిరోజులుగా రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదులు చేశామన్నారు. తహసీల్దార్ అరుణకుమారి స్పందించి చర్యలు చేపట్టారన్నారు.

సందడిగా అపూర్వ కలయిక


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

నెల్లిమర్ల, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలుగోలు ఉన్నత పాఠశాలకు చెందిన 2004-05 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం మంగళవారం అదే పాఠశాల వేదికగా నిర్వహించారు. ఒకరి యోగ క్షేమాలు మరొకరు తెలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా అలనాటి ఉపాధ్యాయులు కాంతారావు, భోజ చక్రపాణి, పిన్నింటి కృష్ణ బాలాజీ పోతునాయుడు, రాంబాబుల, పీఈటీ జగదీశ్, అటెండర్లు పైడితల్లి, అప్పారావులను పూర్వ విద్యార్థులు సత్కరించారు.

రైల్వే అధికారులను కలిసిన వ్యాపారులు

గరివిడి, మే 27(ఆంధ్రజ్యోతి): విజయనగరం రైల్వే అధికారులకు గరివిడి రైల్వే బ్రిడ్జి సమీపంలోని వ్యాపారులు మంగళవారం కలిశారు తమ సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రం అందజేశారు. 45 సంవత్సరాల నుంచి రైల్వేకు సంబంధించిన జాగాలలో షాపులు పెట్టుకొని వ్యాపారాలు చేస్తున్నామని, ఆ షాపులకు సంబంధించి శిస్తులు, అద్దెలు కూడా రైల్వే శాఖకు చెల్లిస్తున్నామన్నారు. అయితే ఇటీవల షాపులను తొలగిస్తామని రైల్వేశాఖ నుంచి నోటీసులు అందాయన్నారు. షాపులు కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే రైల్వే అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని రైల్వే అధికారులను వ్యాపారులు విన్నవించారు. టీడీపీ నాయకులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బలగం వెంకటరావు ఆధ్వర్యంలో వ్యాపారులు కలిశారు.

ఆ ఉపాధ్యాయుడు సేఫ్?

● గర్భవతిని చేసిన ఉదంతంపై క్లీన్‌చిట్
● జరిగిన అన్యాయంపై బాధిత కుటుంబం మౌనం
● ఫిర్యాదు లేకపోవడంతో బయటకురాని వాస్తవాలు
● సెటిల్‌మెంట్‌తో రాజీయత్నాలు

రేగిడి, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలో ఓ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు.. విద్యార్థినిని లోబరచుకుని గర్భవతిని చేసిన ఘటనపై బాధిత కుటుంబం ఫిర్యాదు చేయక పోవడంతో అతడు సేఫ్‌జోన్‌లోకి వెళ్లాడు. ఇప్పటికే విద్యాశాఖ అధికారులు, పోలీసులు దానిపై అంతర్గత విచారణ చేసినా ఆధారాలు లభించలేదని చెబుతున్నట్లు సమాచారం. దీనిపై ఇప్పటికే డీఈవో మాణిక్యంనాయుడుకు స్థానిక ఎంఈవో వరప్రసాదరావు నివేదిక అందజేశారు. సంబంధిత పాఠశాల హెచ్‌ఎం కూడా పాఠశాలలో ఏమీ జరగలేదని రాతపూర్వకంగా ఇచ్చినట్టు సమాచారం. ఈ ఘటనపై ఫిర్యాదు లేకపోవటం, బాధిత కుటుంబం విషయం బయట పెట్టకపోవడంతో ఉపాధ్యాయుడికి కలిసి వచ్చింది. మరోవైపు సదరు ఉపాధ్యాయుడు, బాధిత కుటుంబ సభ్యుల మధ్య వారం రోజులుగా జరుగుతున్న రాజీ చర్చలు బెడిసికొట్టాయనే ప్రచారం జరుగుతోంది. చివరకు సోషల్ మీడియా, పత్రికల్లో కథనాలు రావడంతో సదరు ఉపాధ్యాయుడు అడిగినంత విద్యార్థి కుటుంబానికి ఇచ్చేందుకు ముందుకు వచ్చినట్టు తెలుస్తోంది. దీనిపై ఎటువంటి కేసు లేకుండా, ఉద్యోగానికి ఇబ్బంది లేకుండా ఈ వ్యవహారంలో కొంతమంది మంది పెద్దలు రాజీ కుదిర్చినట్టు సమాచారం.

తల్లి మందలించిందని ఆత్మహత్య

రాజాం రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించవద్దని తల్లి మందలించడంతో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రాజాం ప్రాంతంలో మంగళవారం చోటుచేసుకుంది. ఏఎస్ఐ కె.వి.రమణమూర్తి అందించిన సమచారం మేరకు.. మండల పరిధిలోని బొమ్మినాయుడువలస గ్రామానికి చెందిన నరం సురేష్ (33) మద్యానికి బానిసయ్యాడు. దీంతో మద్యం సేవించవద్దని తల్లి అప్పలనరసమ్మ మందలించింది. దాంతో మద్యం మత్తులో ఈనెల 22న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సురేష్ పరిస్థితిని గమనించిన కుటుంబ సభ్యులు రాజాం సామాజిక ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సురేష్ మంగళవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ కేసు నమోదు చేశారు.

ఆటో ఢీ: వ్యక్తి మృతి

లక్కవరపుకోట, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతపేట జంక్షన్‌కు సమీపంలో సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంలో మార్లాపల్లి గ్రామానికి చెందిన ద్విచక్ర వాహనదారుడు కొటాన రమేశ్ (40) మృతి చెందాడు. ఎల్.కోట నుంచి సంతపేట వైపు వస్తున్న బైక్‌ను కొత్తవలస నుంచి ఎస్.కోట వెళుతున్న ఆటో ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ నవీన్‌పడాల్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

సీతంపేట రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆడలి గ్రామానికి చెందిన గిరిజన యువకుడు నిమ్మక హరీష్(25) శ్రీకాకుళంలోని సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఇందుకు సంబంధించి ఎస్ఐ వై.అమ్మనరావు అందించిన వివరాల మేరకు... ఆడలి గ్రామానికి చెందిన ఎన్.హరీష్ ఈనెల 22న ఓ శుభకార్యానికి వెళ్లాడు. అక్కడి నుంచి ఇంటికి చేరిన హరీష్ అనారోగ్యానికి గురయ్యాడు. దాంతో తల్లిదండ్రులు జనార్దనరావు, కృష్ణవేణి, సోదరుడు నరేంద్ర... సీతంపేట ఏరియా ఆసు పత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళంలోని ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళ వా రం మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పుస్తెల తాడు చోరీ

సీతానగరం, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామవరం పంచాయతీ రెడ్డివానివలసలో నిద్రిస్తున్న మహిళ తలగడ కింద భద్రపర్చిన బంగారం పుస్తెల తాడును గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించాడు. సోమవారం రాత్రి జరిగిన ఘటనపై స్థానిక పోలీసులకు మంగళవారం ఆమె ఫిర్యాదు చేసింది. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. రెడ్డివానివలస గ్రామానికి చెందిన రెడ్డి ప్రియాంక కన వారింట్లో తన తండ్రితో పాటు పిల్లలతో సోమవారం రాత్రి పడుకున్నారు. వరండాలోని మంచంపై ప్రియాంక నిద్రించింది. ఆమె నిద్రించే ముందుకు తలగడ కింద భద్రపరిచిన సుమారు రెండు తులాల బంగారం పుస్తెల తాడు చోరీకి గురైంది. ఇంటికి తలుపులు వేయక పోవడంతో దొంగ లోపలకు చొరబడ్డాడని బాధితురాలు తెలిపింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎం.రాజేశ్ తెలిపారు. ఇదిలా ఉండగా.. ఘటనా స్థలాన్ని క్లూస్ టీం, సీసీఎస్ పోలీసులు పరిశీలించారు.

ఆస్తి తగాదా: ఒకరికి గాయాలు

భామిని, మే 27(ఆంధ్రజ్యోతి): ఆస్తి తగాదాలో ఒకరికి గాయాలైన ఘటన సింగిడిలో మంగళవారం చోటుచేసుకుంది. ఈ ఘటనపై బత్తిలి ఎస్ఐ జి.అప్పారావు తెలిపిన వివరాల మేరకు.. సిగిండి గ్రామానికి చెందిన పాసిర్ల జయకృష్ణ కుటుంబంలో కొన్ని రోజులుగా ఆస్తి తగాదాలు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో మంగళవారం జయకృష్ణ భార్య ఝాన్సీపై మరిది పాసర్ల శరత్‌తో పాటు ఆ కుటుంబ సభ్యులు దాడికి ప్రయత్నించారు. ఇంతలో బయట నుంచి వచ్చిన జయకృష్ణపై శరత్ కత్తితో దాడిచేశాడు. తీవ్ర గాయాలపాలైన జయకృష్ణను భామిని పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్య కోసం సీతంపేట సీహెచ్‌సీకి తరలించారు. ప్రస్తుతం జయకృష్ణ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. జయకృష్ణ ఇచ్చి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

భోగాపురం, మే27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాబువానిపేటలో మంగళవారం నిర్వహించిన దాడుల్లో తొమ్మిది మద్యం సీసాలతో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సిఐ వి.రవికుమార్ తెలిపారు. బెల్టు దుకాణం నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు చేపట్టామన్నారు. దాడుల్లో ఎస్ఐ చంద్రమోహన్, సురేష్, రామారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారని తెలిపారు.


కొత్తవలసలో భారీ వర్షం

కొత్తవలస, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉరుములు, మెరుపులతో దాదాపు రెండు గంటల సేపు వర్షం కురిసింది. సాయంత్రం నాలుగు గంటల నుంచి 6 గంటల వరకు ఏకదాటిగా వర్షం కురియడంతో కొత్తవలస జంక్షన్ జలమయమైంది. కొత్తవలస జంక్షన్‌లోని రైల్వే అండర్ బ్రిడ్జి కిందకు భారీగా నీరు చేరింది. వాహనదారులు ఇబ్బందిపడ్డారు.

●గంట్యాడ: మండలంలోని మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. సుమారు గంటపాటు వర్షం కురవడంతో రోడ్లు జలమయ్యాయి.

రోడ్డును ముంచెత్తుతున్న మురుగునీరు

● ప్రజలకు తప్పని ఇబ్బందులు


రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

రాజాం, మే 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలుచోట్ల మురుగునీరు రోడ్లపై నిలుస్తోంది. డ్రైనేజీల్లో పూడిక నిండటంతో మురుగునీరు ముందుకు సాగే పరిస్థితిలేదు. పట్టణంలో కురిసిన కొద్దిపాటి వర్షానికీ ఎక్కడిక్కడే నీరు నిలుస్తోంది. పాలకొండ రోడ్డులోని శెట్టి వారి వీధిలో వరదనీరు కాలువలోకి వెళ్లే వీలులేకపోవంతో రోడ్డుపైనే నిలిచింది. దీంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. శ్రీకాకుళం రోడ్డుపై మురుగునీరు 15 రోజులుగా ప్రవహిస్తున్నా యంత్రాంగం చర్యలు చేపట్టని తీరుపై స్థానికులు అసంతృప్తి చెందుతున్నారు. డ్రైనేజీల విషయం పలుమార్లు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడంలేదనేది వారి మాట. ఎక్కడిక్కడే మురుగునీరు నిలుస్తుండటంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. పర్యవసానంగా ప్రజారోగ్యంపై ప్రభావం పడుతోంది. ఇకనైనా పాలకులు స్పందించి చర్యలు చేపట్టాల్సి ఉంది.

ఉత్సాహంగా యోగా శిక్షణ



వేపాడ, ఎల్.కోటలో యోగాసనాల శిక్షణ

భోగాపురం, మే27(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో మంగళవారం ఎంపీడీవో కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో యోగాపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయ, సచివాల సిబ్బందికి నారాయణరావు, గణేష్ శిక్షణ ఇచ్చారు.

●గజపతినగరం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక అన్నారు. యోగాంధ్రలో భాగంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

●రేగిడి: యోగాంధ్రలో అందరూ భాగస్వాములు కావాలని ఎంఈవో బి.ఎరకయ్య, ఖండ్యాం, సంకిలి ఆయుర్వేద వైద్యులు సునీల్, డి.మోహనరావు అన్నారు. మంగళవారం మండలంలో ఉంగరాడమెట్ట గురుకుల పాఠశాలలో మండలంలోని సచివాలయ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

●లక్కవరపుకోట: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో మంగళవారం ఉదయం స్థానిక ప్రజలతో కలిసి మండల కమిటీ సభ్యులు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాదరావు, ఎంపీడీవో అప్పారావు, ఎస్ఐ నవీన్ పడాల్, ఏపీఎం శ్రీనివాసరావు, ఏపీవో విజయలక్ష్మి, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

●జామి: మండలంలోని విజినిగిరి యోగ ఆశ్రమంలో మంగళవారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నీలంనాయుడు, సర్పంచ్ సూర్యారావు పాల్గొన్నారు.

●వేపాడ: యోగాతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఎంపీడీవో సిహెచ్.సూర్యనారాయణ అన్నారు. వేపాడలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉదయం నుంచి యోగాసనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవోలు నాగభూషణం, బాలభాస్కరరావు పాల్గొన్నారు.

● కొత్తవలస: కొత్తవలసలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో మంగళవారం యోగాసనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో రమణయ్య, తహసీల్దారు నీలకంఠరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, గ్రామ సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

●గుర్ల: ప్రతీ సచివాలయంలో ఐదు రోజుల పాటు యోగా తరగతులను నిర్వహించాలని జడ్పీటీసీ సభ్యుడు అప్పలనాయుడు అన్నారు. ఎంపీపీ పొట్నూరు ప్రమీలతో కలిసి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. స్థానిక నేచురోపతి వైద్యురాలు రజిత్‌రాయ్ ఆధ్వర్యంలో యోగా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషుబాబు, తహసీల్దార్ ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులనే నియమించాలి

గుమ్మలక్ష్మీపురం, మే 27 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖలో ఉపాధ్యాయుల బదిలీల నేపథ్యంలో ఐటీడీఏ పరిధిలో ఉన్న అన్ని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులనే నియమించాలని ఆదివాసీ గిరిజనాభ్యుదయ సంఘ అధ్యక్షుడు ఆరిక చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో బాలికల పాఠశాలల్లో పురుష ఉపాధ్యాయులను నియమించడం ద్వారా బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనలు చాలా ఉన్నాయన్నారు. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే బాలికల పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులనే నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఐటీడీఏ, డిప్యూటీ డైరెక్టర్ ట్రైబుల్ వెల్ఫేర్ కార్యాలయంలో దినసరి ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో దీర్ఘకాలికంగా ఒకేచోట పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా స్థాన చలనం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

పాలకొండ, మే 27 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ఎడమ కాలువ ద్వారా సాగునీరు విడుదల చేయాలని అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు, రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం వెలగవాడ సచివాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని అందించారు. రైతుల సమస్యలపై బుధవారం ఉదయం 10 గంటలకు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్టు తెలిపారు.

రహదారి మధ్యలో నిలిచిన భారీ వాహనం



రహదారి మధ్యలో ఆగిపోయిన లారీ

పార్వతీపురంటౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని బైపాస్ రహదారికి వెళ్లే దారిలో మంగళవారం ఉదయం భారీ వాహనం నిలిచిపోయింది. విశాఖపట్నం నుంచి ఒడిశా వైపు వెళ్తున్న బొగ్గు రవాణా చేసే భారీ వాహనం సాంకేతిక లోపంతో స్వల్పంగా మంటలు చెలరేగాయి. డ్రైవర్ అందించిన సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది వెంటనే వచ్చి, మంటలను అదుపు చేశారు. అయితే భారీ వాహనం రహదారి మధ్యలో నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఎట్టకేలకు ఆ వాహనాన్ని ట్రాఫిక్ పోలీసులకు తరలించారు.

రేపటి నుంచి రైతులకు అవగాహన

కురుపాం, మే 27(ఆంధ్రజ్యోతి): కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం ఈనెల 29వ తేదీ నుంచి జూన్ 12వ తేదీ వరకు జిల్లాలోగల 15 మండలాల్లో ఉన్న రైతుల వద్దకు వెళ్లి ఖరీఫ్ సీజన్ ముందస్తు ప్రణాళికలపై అవగాహన కల్పించనున్నట్టు రస్తా కుంటుబాయి కృషి విజ్ఞాన సమన్వయకర్త డా.ధ్రువ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. విక్షి సంకల్పయాన్ కార్యక్రమంలో భాగంగా రైతులతో వ్యవసాయం, ఇతర రంగాలపై చర్చిస్తామని చెప్పారు. గ్రామాల్లో ఇఫ్కో సహకారంతో డ్రోన్స్ స్ప్రేయింగ్ ప్రదర్శన, వివిధ పంటల్లో కొత్త రకాల వంగడాలు సాంకేతికతపై చర్చ ఉంటుందని తెలిపారు. అలాగే వ్యవసాయంతో పాటు ఇతర రంగాలైన పశు సంపద విలువ ఆధారిత ఉత్పత్తులు, సేంద్రియ వ్యవసాయం అంశాలపై చర్చ, సందర్శన, వివిధ పంటల సందర్భంచి చీడ పేడలను ఇతర సమస్యలను నివారణ మార్గాలను సూచించడం, కొత్త సమస్యలలకు పరిశోధన చేపట్టడానికి కార్యచర్య రూపొందిస్తామని వివరించారు.

బంగారమ్మకు ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న బంగారమ్మతల్లి

పార్వతీపురంటౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): బెలగాం ప్రజల ఇలవేల్పు బంగారమ్మ తల్లి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. పట్టణ ప్రజల ఇలవేల్పులు ఇప్పలపోలమ్మ, యర్రకంచమ్మల చెల్లెలు బంగారమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని ఘటాలకు పూజలు నిర్వహించా రు. ఈనెల 1వ, 2వ, 3వ తేదీల్లో ఇప్పలపోలమ్మ, యర్రకంచమ్మలతో పాటు బంగారమ్మ తల్లి పండుగను అత్యంత వేడుకగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

లొంగిపోయిన మావోయిస్టు



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ స్వాతి, పక్కన మావోయిస్టు అజయ్

ఒడిశా

రాయగడ, మే 27 (ఆంధ్రజ్యోతి): బీజీఎన్ డివిజన్‌కు చెందిన మావోయిస్టు బిజయ్ పూణెం అలియాస్ అజయ్ మంగళవారం ఎస్పీ ఎదుట లొంగిపోయాడు. ఈ మేరకు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ వివరాలు వెల్లడించారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా గూడెం గ్రామానికి చెందిన బిజయ్ మావోయిస్టు కార్యకలాపాల పట్ల ఆకర్షితుడై 2009లో సీపీఐ మావోయిస్టు ఆర్గనైజేషన్‌లో చేరిన అనంతరం అంచెలంచెలుగా ఎదిగి బంశధార, గుమసార, నాగావళి డివిజన్ పరిధిలో కార్యకలాపాలు నిర్వర్తించేవాడన్నా రు. మావోయిస్టు నాయకుల ప్రవర్తన, విధి విధానాలు, వసతి, ఆహారం లేకపోవడం, భాషా సమస్య, బంధువులకు దూరంగా ఉండడం తదితర కారణాల వల్ల అజయ్ లొంగిపోయినట్టు ఎస్పీ తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టు నుంచి ఒక పిస్తల్, 8 రౌండ్ల బుల్లెట్లు, ఓ వాకీటాక్‌ను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఇతనిపై రూ.4లక్షలు రివార్డు ఉందని ఎస్పీ తెలిపారు.

మునిగుడ సమితిలో ఫిర్యాదుల స్వీకరణ

రాయగడ, మే 27 (ఆంధ్రజ్యోతి): మునిగుడ సమితి కార్యాలయంలో కలెక్టర్ పారుల్ పట్వారి అధ్యక్షతన సంయుక్త ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 44 ఫిర్యాదులు అందాయి. ఇందులో ఆరోగ్య సమస్యలపై ఆర్థిక సహాయం కోసం కోరిన ఇద్దరికి కలెక్టర్ రూ.5వేలు చొప్పున సాయం అందజేశారు. ఎడిషనల్ ఎస్పీ బిష్ణు ప్రసాద్ పాత్ర, గుణుపూర్ సబ్ కలెక్టర్ కిరణ్‌దీప్ కౌర్, గుణుపూర్ ఐటీడీఏ అధికారి అజయ్‌కుమార్ ప్రధాన్, సీడీఎంవో ప్రఫుల్ల కుమార్ పాడి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాస్త బాగుచేస్తే.. అద్దె మిగులుతుంది కదా..

- పరాయి పంచన పీఏసీఎస్ కార్యాలయం
- నిరుపయోగంగా పాత తహసీల్దార్ భవనం



నిరుపయోగంగా ఉన్న పాత తహసీల్దార్ భవనం,



అద్దె భవనంలో పీఏసీఎస్ కార్యాలయం

వీరఘట్టం, మే 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సుమారు ఆరేళ్ల కిందట కొత్త భవనంలో మార్చడంతో పాత కార్యాలయం నిరుపయోగంగా మిగిలింది. అయితే వీరఘట్టం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం మొదటి నుంచి అద్దె భవనంలో కొనసాగుతోంది. ఈ కార్యాలయాన్ని నిరుపయోగంగా ఉన్న పాత తహసీల్దార్ కార్యాలయంలోకి మారిస్తే అద్దె అయినా మిగుతుంది కదా.. అని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి మరమ్మతులు చేయిస్తే అందులో ప్రభుత్వ కార్యాలయాలు నిర్వహించుకోవడానికి అనువుగా ఉంటుంది. గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు హడావుడిగా ఈ భవనంలోనికి పీఏసీఎస్ కార్యాలయాన్ని మార్చేందుకు ప్రయత్నించింది. చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలు తొలగింపజేసి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పేరుతో ఫ్లెక్సీలు కూడా అమర్చారు. కానీ అనంతరం ఎన్నికలు రావడంతో ఆ కార్యక్రమం వాయిదా పడింది. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటికీ దానిపైన దృష్టి సారించలేదు. ప్రస్తుతం పీఏసీఎస్ కార్యాలయం అద్దె భవనంలోనే కొనసాగుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్యాలయాన్ని పాత తహసీల్దార్ భవనంలోకి మరిస్తే అద్దె అయినా మిగులుతుందని పలువురు అంటున్నారు. ● ఈ విషయం పీఏసీఎస్ సీఈవో బూరాడ పైడిరాజు వద్ద ప్రస్తావించగా ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశామని చెప్పారు. అధికారులు ఆదేశిస్తే కార్యాలయాన్ని పాత తహసీల్దార్ కార్యాలయానికి మారుస్తామని తెలిపారు.

యోగాతోనే ఆరోగ్యం

- ఉత్సాహంగా శిక్షణ కార్యక్రమాలు ● అవగాహన ర్యాలీలు



బొబ్బిలి రూరల్: యోగా శిక్షణ నిర్వహిస్తున్న దృశ్యం

పార్వతీపురంటౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): యోగాతోనే ఆరోగ్యంగా జీవించవచ్చునని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టనంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ● పాలకొండ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబు, వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి, అధ్యాపకులు పాల్గొన్నారు. ● బలిజిపేట: యోగాంధ్రలో భాగంగా మండల కేంద్రంలో ఎంపీడీవో నగేష్ ఆధ్వ ర్యంలో ర్యాలీ నిర్వహించారు. అధికారులు, వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. ● గరుగుబిల్లి: మండల కేంద్రంలో ఎంపీడీవో జి.పైడితల్లి ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ పి.బాల, ఏవో అర్జునరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. ● సాలూరు రూరల్: కొత్తవలస, మామిడిపల్లి, మావుడి, బోరబంద తదితర గ్రామాల్లో ఉద్యోగులు, వైద్య సిబ్బంది యోగాసనాలు వేశారు. ● సీతానగరం: స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్, ఇన్‌చార్జి తహసీల్దార్ ఎ.ఉమామహేశ్వరరావు పర్యవేక్షణలో మంగళవారం యోగా శిక్షణ నిర్వహించారు. అనంత రం ర్యాలీ చేశారు. ● కురుపాం: కురుపాంలో మంగళవారం ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అధికారులు పాల్గొన్నారు. ● గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురంలో తహసీల్దార్ శేఖరం, ఎంపీడీవో సాల్మన్‌రాజ్ ఆధ్వర్యంలో మంగళవారం యోగాపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎస్ఐ శివ ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు. ● భామిని: భామిని జడ్పీ పాఠశాలలో మాస్టర్ ట్రైనర్ వి.శ్రీరాములు విద్యా ర్థులకు యోగా ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. పీడీ శంకరరావు, సీహెచ్‌వో భాస్కరరావు పాల్గొన్నారు. ● సీతంపేట రూరల్: స్థానిక ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌లో ఎంపీడీవో బీబీ మిశ్రో ఆధ్వర్యంలో మంగళవారం అధికారులు యోగాసనాలు వేశారు. తొలుత ర్యాలీ నిర్వహించారు. ఏటిడబ్ల్యువో మంగవేణి, ఏపీవో సాగర్ పాల్గొన్నారు. ● వీరఘట్టం: మండలం కేంద్రంతో పాటు నడిమికెల్ల, చిదిమి గ్రామ సచివాలయం ఆవరణలో మంగళవారం యోగా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో బి.వెంకటరమణ, వీరఘట్టం పంచాయతీ ఈవో బి.కోటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు. ● బొబ్బిలి రూరల్: బొబ్బిలిలోని పొట్టి శ్రీరాములు పాఠశాల ఆవరణలో మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం యోగాపై శిక్షణ కార్యక్రమం నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ● రామభద్రపురం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో రత్నం ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బైపాస్ రోడ్డులో మానవహారం నిర్వహించారు. ● బాడంగి: మండల కేంద్రంలో ఎంపీడీవో ఎస్.రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం యోగాపై ర్యాలీ నిర్వహించారు. యోగా శిక్షణ నిర్వహించారు.



బాడంగిలో యోగాసనాలు వేస్తున్న దృశ్యం



సీతంపేట రూరల్: ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌లో..



రామభద్రపురంలో మానవహారం

మరమ్మతులు చేస్తే.. సస్యశ్యామలమే..

(3వ పేజీ తరువాయి)

మారింది. మొత్తంగా అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా 211 ఎకరాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు. ఈ ఖరీఫ్‌లోగా పనులు పూర్తిచేసి పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గత ఐదేళ్లూ పట్టించుకోలే..

గత ఐదేళ్లుగా రిజర్వాయర్‌ను ఎవరూ పట్టించుకోలేదు. తలుపులు మరమ్మతులకు గురైన విషయాన్ని ఎన్నోసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలియజేశాం. అయినా ఎవరూ స్పందించలేదు. వరుణుడిపై ఆధారపడి రైతులు సాగు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నాం. రిజర్వాయర్ తలుపులను బాగు చేసి, కాలువల్లో పూడికలు తీసి.. పొలాలకు సక్రమంగా నీరందించేలా చర్యలు తీసుకోవాలి.

- బి.పార్థసారథిరావు, అధ్యక్షుడు, నూలుగెడ్డ నీటి వినియోగదారుల సంఘం

ప్రతిపాదనలు పంపించాం..

కురుపాం పరిధిలో మినీ రిజర్వాయర్ మరమ్మతులు, కాలువల్లో పూడికతీత, చెరువుల అభివృద్ధికి ఓఎన్ఎం కింద ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం.

- భావన, జేఈ ఇరిగేషన్, కురుపాం

వర్షంతో తిప్పలు



లివిరిలో కల్లాల్లో ధాన్యంపై టార్పాలిన్లు కప్పుతున్న దృశ్యం

భామిని, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మధ్యాహ్నం రెండు గంటలు అయితే చాలు మబ్బులు, ఉరుములు, మెరుపులతో వర్షం తప్పడం లేదు. మంగళవారం లివిరి ప్రాంతంలో వర్షం కురవడంతో కల్లాల్లో నిల్వ ఉంచిన ధాన్యం టార్పన్లు కప్పేందుకు రైతులు అవస్థలు పడ్డారు. భామిని, దిమ్మిడిజోల, కీసర, కోసలి తదితర ప్రాంతాల్లో చిరుజల్లులు కురవడం, ఆరుబయట ఉన్న మొక్కజొన్న గింజలను జాగ్రత్త చేశారు. అయితే వాతావరణం మేఘావృతం కావడంతో ఏ సమయంలో వర్షం కురుస్తుందోనని అన్నదాతలు దిగులు చెందుతున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

సాలూరు రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): సాలూరు మున్సిపాలిటీలో బీపీఎస్ నిధులు రూ.2కోట్లతో చేపడుతున్న నీటి సౌకర్యాల పనులు, అభివృద్ధి పనులను మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ బీవీ ప్రసాదరావు మంగళవారం పరిశీలించారు. శ్రీరామాకాలనీ, పదో వార్డు పరిధిలో ఉన్న డెంకానవీధిలో పైలెట్ వాటర్ స్కీం కోసం తీస్తున్న బోరు పనులను పరిశీలించారు. సాలూరు మున్సిపాలిటీకి వచ్చిన రూ.2కోట్ల నిధులతో తాగునీటి పైలెట్ వాటర్ స్కీం, రోడ్లు పనులను ప్రతిపాదించిన విషయం విధితమే. ఈ నిధులతో దాదాపు 77 పనులకు టెండర్లు పిలిచారు. వాటిలో 66 టెండర్లు పైగా ఖరారు కావడంతో పనులను ప్రారంభిస్తున్నారు. వాటిలో రెండు చోట్ల జరుగుతున్న తాగునీటి సౌకర్యాల పనులను ఆయన పరిశీలించారు.

కో ఆపరేటివ్ బ్యాంకుపై విచారణ

బాడంగి, మే 27(ఆంధ్రజ్యోతి): బాడంగి కోఆపరేటివ్ బ్యాంకుపై అవినీతి ఆరోపణలు రావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు విజయనగరం సబ్ రిజిస్ట్రార్ రెజ్వాన్ షరీఫ్ మంగళవారం ఆ బ్యాంకులో విచారణ నిర్వహించారు. ఇప్పటివరకు బ్యాంకు ద్వారా ఎవరెవరు రుణాలు పొందారు వివరాలు సేకరించి, అనంతరం వారు నుంచి రికవరీ చేశారా లేదా అని ఆరా తీశారు. ఈ బ్యాంకులో రుణాలు పొందినవారు ఈనెల 31 వరకు వచ్చి తాము కట్టిన డబ్బు జమ అయిందోలేదో నిరూపించుకోవాలని, రుణం తీసుకున్నవారు బ్యాంకుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు కోఆపరేటివ్ బ్యాంకు సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, రుణగ్రహీతలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తిచేయండి

వీరఘట్టం, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్మాణంలో ఉన్న గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని గృహ నిర్మాణశాఖ ఏఈ వినోద్‌కుమార్ కోరారు. ఆయన మండల కేంద్రంలో మంగళవారం పర్యటించారు. మండలంలో జూన్ 12న గృహ ప్రవేశాలు కార్యక్రమం ఉన్నందున ఆర్సీ ఆర్ఎల్ దశలో ఉన్న గృహాలను పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. మండలంలో 258 ఇళ్లకుగాను సుమారు 200 ఇళ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. నిర్మాణాలు పూర్తి చేసిన వెంటనే బిల్లులు చెల్లింపులు చేస్తామన్నారు.

1 నుంచి పుస్తకాలు అందిస్తాం

వీరఘట్టం, మే 27 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న పుస్తకాల స్టాక్ పాయింట్‌కు జిల్లా నుంచి పుస్తకాలు అందాయని ఎంఈవో ఆనందరావు తెలిపారు. ఆయన మంగళవారం స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 19,082 పాఠ్యపుస్తకాలు, 22,492 నోట్ పుస్తకాలు, 4022 బ్యాగులు, 2876 బెల్ట్‌లు మండలానికి చేరాయని తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి పాఠశాలలకు పుస్తకాలను అందేస్తామన్నారు.

న్యూస్ బాక్స్

పొదుపు సంఘాలపై విచారణ

బొబ్బిలి రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): అలజంగి గ్రామంలో పొదుపు సంఘాల నగదు లావాదేవీల్లో అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఆ గ్రామంలో బొబ్బిలి ఏపీఎం భాగ్యలక్ష్మి విచారణ చేపట్టారు. ఏరియా కోఆర్డినేటర్ ఆదియ్య సమక్షంలో తొలుత రెండు సంఘాల వారిని విచారించారు. ఈ విచారణలో గరివిడి, మెంటాడ, రాజాం, రామభద్రపురం, బొబ్బిలి ఏపీఎంలతో పాటు స్త్రీనిధి మేనేజర్ రమేష్ పాల్గొన్నారు. మిగతా అన్ని సంఘాల విచారణ పూర్తి అయ్యేవరకూ కొనసాగిస్తామని ఏపీఎం తెలిపారు.

కౌలుదారు కార్డులు ఇప్పించండి

బొబ్బిలి రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): కౌలురైతులకు ఈ సీజన్‌కు ముందే కౌలుదారు కార్డులు ఇప్పించాలని ఏడీఏ మజ్జి శ్యామ్ సుందర్ ఆదేశించారు. మంగళవారం బొబ్బిలి రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఎం.శ్రీను ఆధ్వర్యంలో ఆయన రెవెన్యూ, వ్యవసాయ శాఖ గ్రామ స్థాయి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులందరికీ అన్నదాత సుఖీభవ సాయం అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, వీఏఏలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట సిద్ధం

గరుగుబిల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట ఎరువులు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారిణి ఆర్.విజయభారతి తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. 10 కిలోల కట్టెలు రూ.560, నవధాన్యాలు కిట్టు రూ.200, అలాగే జీలుగు, కట్టెలు, పిల్లి పెసర మొత్తంపై 10 కిలోలు రూ.660 చెల్లించాలన్నారు.

విజిలెన్స్ సభ్యుల ఎంపిక

పార్వతీపురం, మే 27 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడిగా బలిజిపేట ఎంఈవో-1గా పనిచేస్తున్న సామల సింహాచలం నియమితులయ్యారు. ఈమేరకు కలెక్టర్ శ్యాంప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఎస్సీ ఎస్టీ అధికారుల తరపున తనను జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడిగా ఎంపిక చేసినందుకు ఆయన కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ● సీతానగరం: జిల్లా విజిలెన్స్ పర్యవేక్షణ సభ్యుడిగా రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.బలరాం నాయుడును నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో సభ్యుడిగా కె.బలరాంకు అవకాశం దక్కింది.

ఇంటర్మీడియట్ సీట్లు పెంచాలి

గుమ్మలక్ష్మీపురం, మే 27 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలో ఉన్న ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ సీట్లు పెంచాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు పల్లా సురేష్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రవేశాలే లేకపోతే గిరిజన విద్యార్థులు ఇబ్బందులు పడతారన్నారు. విద్యార్థులందరికీ సీట్లు కల్పించాలని కోరారు.

హనుమాన్‌కు సింధూర పూజలు



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొండ, మే 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంజనేయనగర్‌లో గల దక్షిణాముఖ ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు దాకమర్రి సూర్యారావు ఆధ్వర్యంలో స్వామివారికి సామూహిక సింధూర పూజలు, తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు.